# పైరవీలు - పైరసీలు !!

మహతి మీటుతూ త్రిలోక సంచారం చేసే అవస్త నారద మహర్షికి తప్పినందుకు తెగ మురిసిపోతున్నాడు. భూమండలంలో మొబైల్ టెక్నాలజీ పెరిగి ఆవిష్కరంపబడిన తర్వాత ముల్లోకాలూ తిరుగుడు తప్పి దేవతలందరినీ మొబైల్‌లోనే సంప్రదించగలుగుతున్నందుకు ఆయనగారి పని మేడీ అయింది. నిత్యం జపించే నారాయణ మంత్రాన్ని సైతం మొబైల్‌లోగల ఎస్.ఎం.ఎస్. ఫెసిలిటీ ద్వాఅ శ్రీహరికి కమ్యూనికేట్ చేయగలుగుతున్నాడు.

అటు తండ్రి బ్రహ్మను... ఇటు దేవేంద్రుడిని సైతం సెల్లోనే కాంటాక్ట్ చేస్తున్నాడు నారదుడు.

మొబైల్ కనుగొనబడిన దేశానికి పయనమై వెడలి... దాన్ని తయారుచేసిన శాస్త్రజ్ఞుడ్ని స్వయంగ కల్సుకుని మెడలో దండవేసి అతగాడిని మనసారా అభినందించి తిరిగి దేవలోకానికి పయనమౌతూ... ముక్కోటి దేవతలకు సైతం మొబైల్ సర్వవిధంబుల ఉపయోగపడగలదని యోచించినవాడై పుష్పకవిమానంలో సంచీలకొద్దీ మొబైల్స్‌ను ప్యాక్ చేయించి ఒక్కోలోకాని వెడలి అక్కడి వారందరికీ వాటిని పంచుతూ వాటి వుపయోగం గురించి వివరించి అందరి మెప్పుకూ పాత్రుడైనాడు !!

'డాడీ ! నేను భూలోకానికి వెడుతున్నాను. కొన్నాళ్ల పాటు అక్కడే వుండలిచాను. 'బ్రహ్మతో మొబైల్ ద్వారా కాంటాక్ట్ చేసి చెప్పాడు కుమారుడు నారదుడు !

'ఇప్పుడు అక్కడెందుకోయ్? నీకు పనీపాటా లేదా ఏం? భూలోకం భూకంపాలతో దద్దరిల్లి సునామీ దెబ్బలకు సొమ్మసిల్లిపోతోందని ఎరుగవా?..'

'ఎన్ని ఉపద్రవాలు సంభవించిననూ నాకొచ్చిన భయమేమున్నది డాడీ?..

'భూలోకమునగల ఏ దేశానికి నీ ప్రయాణం సన్నూ?-'

'ఇండియా చూడాలని కోరికగావుంది డాడీ ! అక్కడి రాజకీయపార్టీలు నన్ను ఎన్నికల ప్రచారానికి రమ్మని ఆహ్వానించితిరి!.

'ఎన్ని పార్టీలకని ప్రచారం చేయగలవు కుమారా?-'

'నేను అందరివాడను కదా... అన్ని పార్టీలకూ ప్రచారం చేసెద...'

'అటుల చేయవలదు బాడ్డా !... ఆ విధముగ చేసిన నీకు ముప్పు వాటిల్లగలదు. అయిననూ ఈ విషయములో శ్రీహరిని సంప్రదించి వారి అంగీకారము ఆశీస్సులు పుచ్చుకుని ఒక నిర్ణయాన్ని పుచ్చుకొనుము....'

'శ్రీహరిని మొబైల్లోనే సంప్రతించెద...' అన్చెప్పి శ్రీమహావిష్ణువు నెంబర్ డయల్ చేశాడు.

'నమస్తే గురువర్యా !... సారీ... శ్రీమన్నారాయణా ! నమోవాకములు....'

"చాలు నీ అధిగప్రసంగము ! నాతో మొబైల్ ద్వారా మాట్లాడుటకు నీకెన్ని గుండెలు?

'అదేంటి సార్ అలా కసురుకుంటారు?. అద్సరేగానీ నారాయణగారూ... అమ్మగారు... అదే మేడమ్ లక్ష్మీగారు మీ పాదాలచెంతనే వున్నారా?... లేక బంగళాలో వంటపనిలో నిమగ్నమైనారా?-'

'ఆ విషయాలన్నీ నీకెందుకోయ్?-'

'నాకెందుకా?- నాకు అక్కర్లేని విషయము కలదా?-'

'అయినా అమ్మగారితో నీకేంపని?-'

'అబ్బే నాకేం పన్లేదు. అనవసరంగ డౌట్‌పడి అపార్థం చేసుకోకండి ! - ఎప్పుడైనా నేను భూలోకానికి వెళ్ళేయితే తనూ నావెంట వస్తానంది...."

'ఎందుకుట?'

'హాలీవుడ్‌లో ప్రపంచసుందరి అందాలపోటీలు జరుగుచున్నవి వరా... మీ ఆవిడ కూడా పాల్గొంటుందిట...'

'నోర్మూయ్ నారదా ! అపుము అధికప్రసంగము... అధిక ప్రేలాపనలు...'

ఇంతలో కాల్ డిస్కనక్ట్ అయింది ! పిడుగులు పడినకారణాన టెలీకమ్యూనికేషన్ వ్యవస్థ అవస్థలుపాలైంది.

ఇంతలో ఏదో పనుండి వరుణుడు శ్రీహరి దర్శనార్థమై వచ్చె !

'ఏమయ్యా వరుణా... నీకేమైనా బుద్ధివుందా? ఎప్పుడుపడితే అప్పుడు తీవ్రమైన గాలులు వీస్తుంటే లోకాలు అల్లకల్లోలమవుతుంటే గాలిని కంట్రోల్ చేయాలని కదా? - తుమ్మితే దగ్గితే పోయే విద్యుత్ మనది ! ఇక వురుములు మెరుపులు విజృంభిస్తే

అన్ని వ్యవస్థలు అస్తవ్యస్తమైపోయిన అందరికీ ఎంత ఇబ్బందో గ్రహించవా?-'

'సారీ సర్ ! పొరపాటైంది.... మన్నించండి !!-'

'వరుణా ! నాకమో ఇంద్రుడి నెంబర్ కలవటంలేదు. నువ్వొకసారి ట్రై చేసి లైన్లోకి రమ్మను...'

వాతావరణం తిరిగి కంట్రోల్‌లోకి రావటంతో వరుణుడు మురుస్తూ ఇంద్రుడి నెంబర్ డయల్ చేయగానే దొరకటంతో.... రింగ్ అవుతూండగ సెల్ శ్రీహరికి అందించాడు.

'ఇదిగో ఇంద్రా హౌఆర్‌యూ? - బైదిబై రంభ ఊర్వశి మేనక తిలోత్తమలేం చేస్తున్నారోయ్?'

'బ్యూటీ పార్లర్‌కి వెళ్లినట్టు వున్నారు సార్...'

'అందగత్తెలకు అపురూప సౌందర్యరాసులక్కూడా బ్యూటీపార్లర్లేల?-'

'భూలోక నాగరికత ప్రభావం దేవలోకందాకా పాకింది సార్ ! - అందాల పోటీలు... ర్యాంప్ వాక్‌లూ... సినీమాల్లో ఐటెమ్‌సాంగ్స్‌లో నర్తించే నటీమణులను చూచి అనుకరిస్తున్నారు సార్...'

'సరే సరే ! ఒకసారి ఆ తలుగురునూ వైకుంఠానికి పంపించు !-'

'దేనికి సార్ !-'

'షటప్ ! అన్నీ నీతో చెప్పాలా? - శ్రీమహావిష్ణువుకు అందరితోనూ పన్లుంటయ్...

'అదికాదు సార్... వాళ్లనే తమవద్దకు పంపానని మీ శ్రీమతిగారికి తెలిస్తే... నామీద మండిపడతారేమోనే భయంగ వుంది....'

'ఏవేవో వూహిచుకోకు ఇంద్రా ! - నోరుమూసుకుని చెప్పినట్టు చెయ్. లక్ష్మిని కంట్రోల్ చేసే విషయం నేను చూచుకోగలను. నాకొదిలెయ్...'

'ఏదేమైనా సహిస్తుందేమోగానీ సార్... పరాయి స్త్రీలతో భర్త విచ్చలవిడిగా ప్రవర్తించటం తాళి కట్టించుకున్న భార్య హర్షించదుసార్...'

'నీ ఆలోచన తగలెయ్య అతిగి వాక్కు! సనీమాల నాలెడ్జి ఎక్కువై నీ వాగుడు శృతిమించుచతోంది ! నీవు శృంగారపురుషుడివి కనుక అందరూ నీలా వుంటారని అనుకోకు ! పొమ్మ్ ! వెళ్లి ఆనలుగురు నీ వెంటనే పంపించు'

'ఆ నలుగురూ అంటే సెంచురీ కొట్టిన తెలుగు సినీమా ఏమో అనుకున్నాను...'

'నువ్వా సినిమా చూశావా?-'

'లవున్సార్ ! అద్భుతంగ వుంది'

'నాకూ చూడాలనివుంది ఇంద్రా... కాకపోతే ఎంత ప్రయత్నించినా సి.డి. దొరకలేదు....'

'నన్నడగండి సార్ ! నావద్ద వున్నవన్నీ పైరసీ సీడీలే !-' పళ్లికిలించాడు ఇంద్రుడు.

'పైరసి అరకట్టమంటూ సినిమా నిర్మాతలు... దర్శకులు... నటులు గొంతు చించుకుంటుంటే నువ్వు పైరసీ సీడీలు తయారు చేసి వాటిని అమ్మి సొమ్ము చేసుకోవటం దుర్మార్గం. ఈ విషయం రక్షక భటులకు తెలిసిన నిన్ను లాకప్‌లో వేసి కుమ్ముదరు జాగ్రత్త !'

'మీరు మా టాప్ బాస్ కదాని మేటర్ లీక్ చేశాను. మీరిలా కోప్పడతారనుకుంటే మౌత్ ఓపెన్ చేసేవాడినేకాదు....'

'సర్లే. నువ్వెళ్లి ఏ చెప్పినపని చెయ్! వెళ్లు -'

ఏం క్లాసు పీకాడ్రా దేవుడా? ఈరోజు శ్రీహరిగారి మూడేం బాగున్నట్టులేదు. నేరకపోయి రాహుకాలంలో వచ్చి వుంటాను... అని గొణుక్కుంటూ వైకుంఠం నుంచి నిష్క్రమించి దేవేంద్రలోకానికి పయనమైనాడు.

+ + +

+

'సార్ సార్ సార్... భూలోకంలో నెల దేవలోకంలోనూ పైరవీకారులు ఎక్కువైనారు సార్ ! - ఏ పని కావాలన్నా వీళ్ల ద్వారా లంచమిచ్చి చేయించుకొనుట ఎక్కువైనది. అవినీతి రోగమూ మనలోకమునకూ పాకి ప్రబలుచున్నది... ! యమధర్మరాజు అవినీతికి పాల్పడి చనిపోయిన వారి బంధువుల నుండి లంచము పుచ్చుకొనుచూ మృతులకు ప్రాణము 'పోయుచున్నాడని తెలిసింది ప్రభూ'. అంతరంగిక సలహాదారుడు శ్రీమహావిష్ణువుకు విన్నవించెను.

'పేరుకే యమధర్మరాజేగాని చేయునవన్నీ అధర్మ కార్యములన్నమాట... చూచెద... చూచెద.. ఒకనాటికి అతగాడిపైకి ఎ.సి.బి. టీమ్‌ను వుసికొల్పెదను. అతని ఆస్థి వివరములను సేకరించి... ఆదాయమునకు మించి ధన కనక వస్తువాహనములున్నచో... అతగాడిని పదవీచ్యుతుడకావించెదగాక !....'

'ఆయనగారొక్కరే కాదు సార్ !... ఈమధ్య మద్యం... అదేసార్.. మనం సేవించే అమృత షాపులు కడకు బెల్ట్‌షాపుల సముదాయాలై... తెల్లరేషన్ కార్డ్ వారి బినామీ పేర్లతో సిండికేట్లు బడాకేట్లుగా మారి వ్యాపారం సాగిస్తున్న విషయం మీదాకా వచ్చిందో లేదోని మనవి చేస్తున్నాను. ఇవన్నీ దేవేంద్రులుంగారి కుట్రలు... కుతంత్రాలు ! ఆయనగారికి ధనదాహం ఎక్కువై మితిమీరి వ్యవహరిస్తున్నాడు.. ఈ వ్యవహారంపై కూడా మీరు దృష్టిసారించి తగిన యాక్షన్ తీసుకోకున్నచో... కడకు మీ పదవికే ఎసరొస్తుంది. అప్పుడు విచారించి ప్రయోజనం వుండదు. మళ్లీ రానున్న ఎన్నికల్లో తమరు పోటీ చేసినా... వైకుంఠాధిపతి కాలేరు...'

'అదిసరే... మన ప్రజానాయకులు... వారి బంధువర్గం పేర ఇసుక టెండర్లను చేజిక్కించుకుని... బ్రహ్మదేవుని అండదండలతో కాలువల్లో చెరువుల్లో, నదుల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారట. అందేమిటని ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై కయ్యానికి కాలుదువ్వి హతమారుస్తున్నారట !. అధికారులు సైతం వారిపై కేసులు బుక్ చేయటానికి హడలి చస్తున్నారట...' ఇసుక మాఫియా వారి చర్యలు మితిమీరుచున్నవి.

దొరవారూ ! శ్రీహరిగారూ మీరు చెప్పేది అక్షరాలా నిజం. ఒకసారి మీరు బ్రహ్మగారిని మందలించుట మంచిది.'

అది అసాధ్యం సెక్రెటరీ... ఎంచేతనంటే రోజులు మారినయ్‌క ! నా పవర్ తగ్గిపోతోంది. నామాట ఎవ్వరూ లక్ష్యపెట్టుటలేదు. ఈ సృష్టికి మూలకారకుడు తానావున... తననెవ్వరూ ఏమీ చేయలేరని అతగాడి ధీమా... మిగతా వారు సైతం అతనికే వంతపాడుతున్నారు. గట్టిగా మాట్లాడిన నన్ను పదవీచ్చుతుడిని చేయుదురేమోనే భయం నాలో లేకపోలేదు. నా పదవి నేను నిలబెట్టుకోకున్న శ్రీమహాలక్ష్మికి చులకనైపోవుట ఖాయం.

'సార్ ! మీరెందుకు భయపడటం ! మీరు సుప్రీం ! తమవద్ద సుదర్శన చక్రమం కలదు. ఎవరినైనా సంహరించగల పవర్ మీకు వుండనే వుంది ! అనవసరంగ కలత చెందవలదు ! ధైర్యాన్నికూడగట్టుకోండి శ్రీహరీ ! అలనాడు రాక్షస సంహారానికి పూనుకున్న మీరు... అదే అస్త్రాన్ని దేవతలపై కూడా ప్రయోగించి నోళ్లు మూయించండి !. ముందు పైరవీగాళ్లను... పైరసీగాళ్ల 'హవా' ను రూపుమాపండి. అటుపై దేవతల

పనిపట్ట వీలగును....’

‘నీ సలహా అద్భుతం !... అమోఘం ముఖ్య కార్యదర్శీ.!... సమయానికి సరైన సలహా ఇచ్చి నన్నూ నా పదవిని కాపాడుకొనుటకు మార్గము సూచించి గతాన్ని గుర్తుకు తెచ్చితివి. ధన్యవాదములు ! పైరవి పైరసీ వారిపై ఉక్కుపాము మోపెద ! నిర్దాక్షిణ్యముగ వారిని సంహరించుట ప్రారంభించెదను - ఇక నీవు పోయిరమ్మి. నాక్కొంచెం విశ్రాంతి అవసరం....’

శ్రీహరి ఆంతరంగిక సలహాదారుడు నిష్క్రమించగా శేషసాయిపై పవ్వళించిన శ్రీహరి కన్నులు మూసుకుని నిద్రలోకి జారిపోయె !!

--- సమాప్తం ---

(21-10-2012 ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధలో)